సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 12 । జనవరి । 2024



మార్లవాయిని అభివృద్ధి చేస్తాం

చారిత్రాత్మకమైన మార్లవాయి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎంపీ సోయం బాపురావు అన్నారు. మార్లవాయిలో డార్ఫ్ దంపతుల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. 8లో▸

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు బంద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో నిర్వహిస్తున్న పత్తి క్రయ విక్రయాలను ఈ నెల 12నుంచి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్ మండలం రేపల్లేవాడ శివారులో ఉన్న రెండు ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో ఇప్పటివరకు కొనుగోలు చేసిన పత్తి నిల్వలు పేరుకుపోయాయని తెలిపారు. సంక్రాంతి సెలవులు రావడంతో పత్తి కొనుగోళ్లను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. తిరిగి ఎప్పుడు కొనుగోళ్లను ప్రారంభిస్తామో త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 /19.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి

• జిల్లా కలెక్టర్ సంతోష్



నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రాథమిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి గ్రామ పంచాయతీ, మండల, జిల్లా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళిక రూపొందించే సమయంలో అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో నరేందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, డీపీవో వెంకటేశ్వర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

నమోదుపై అప్రమత్తంగా ఉండాలి

మందమర్రిరూరల్: ప్రజాపాలనలో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సంతోష్ సిబ్బందికి సూచించారు. గురువారం మందమర్రి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుతో కలిసి పరిశీలించారు.

'మైనారిటీ ఓట్ల కోసమే కాంగ్రెస్ గైర్హాజరు'



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: మైనారిటీ ఓట్ల కోసమే రామ మందిర ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ పార్టీ గైర్హాజరు అవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 22న రామ మందిరం ప్రారంభోత్సవానికి ప్రజలందరికీ ఇంటింటికి శ్రీరాముని అక్షింతలు అందజేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం ప్రారంభోత్సవానికి వచ్చేందుకు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు దొంగ గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి మోసం చేసిందని విమర్శించారు. ఈ సమావేశంలో రజనీశ్‌జైన్, నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, అరుముళ్ల పోశం, తుల ఆంజనేయులు, ముదాం మల్లేశ్, బొద్దున మల్లేశ్, పట్టి వెంకటకృష్ణ, నాగేశ్వర్‌రావు, రాచర్ల సంతోశ్, బోయిని హరికృష్ణ, గాజుల ప్రభాకర్, అశోక్, బల్ల రవి, తరుణ్, శ్రవణ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా చూడాలి



మాట్లాడుతున్న సుబ్బరాయుడు

చెన్నూర్‌రూరల్: పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా చూడాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు సూచించారు. మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఓపీ రిజిష్టర్, మందులు ఉన్నాయో లేదో సందర్శించారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఆశాలు, సిబ్బంది సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బుధ, శనివారాల్లో గర్భిణులు, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. విధులపై నిర్లక్ష్యం వహించద్దని అన్నారు. ఈ సమావేశంలో పీహెచ్‌సీ వైద్యుడు కృష్ణతేజ, హెచ్ఈవో జగదీశ్ పాల్గొన్నారు.

కుర్చీ కోసం ఖర్చు



క్యాంపు నుంచి నేరుగా మంచిర్యాల మున్సిపల్ సమావేశానికి వచ్చిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో పాలకవర్గాలపై అసంతృప్తితో అవిశ్వాసాల పర్వం కొనసాగుతోంది. అవిశ్వాసాలు నెగ్గేందుకు లీడర్లు తెర వెనక రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. పట్టణాల్లో తమ పట్టు పెంచుకోవడంతోపాటు చైర్మన్, వైస్‌చైర్మన్‌గా పదవులు దక్కించుకోవాలనే తపనతో ఖర్చుకు వెనుకాడడం లేదు. కొత్త వారి ఎన్నిక కోసం రాజకీయంతోపాటు అర్థబలం ఉన్న నాయకులే కుర్చీ కోసం ముందుకు వస్తున్నారు. ఇదే అదనుగా కొందరు సభ్యులు తమ జేబులు నింపుకొనేందుకు సిద్ధపడుతున్నారు. దీంతో బల్దియాల్లో రాజకీయం రసవత్తరంగా మారింది.

- చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం వెచ్చింపు
- క్యాంపుల నుంచి ఎన్నిక దాకా భరింపు
- రూ.లక్షలు ఖర్చు చేస్తున్న లీడర్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పట్టణ పాలకవర్గాల్లో చైర్మన్, వైస్ చైర్మన్ కుర్చీలో కూర్చోవలనుకునే వాళ్ళు రూ.లక్షలు ఖర్చు చేసుకుంటున్నారు. మరో ఏడాదిపాటే ఉన్న ఈ పట్టణ పదవుల కోసం జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో రాజకీయం ఆసక్తిగా సాగుతోంది. ఇప్పటికే మంచిర్యాలలో అవిశ్వాస తీర్మానం చైర్మన్, వైస్ చైర్మన్లపై మెజార్టీ కౌన్సిలర్ల మద్దతుతో నెగ్గింది. శుక్రవారం నస్పూర్, బెల్లంపల్లి పట్టణ పాలకవర్గ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఇప్పటికే బెల్లంపల్లిలో చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లు, నస్పూర్ వైస్ చైర్మన్ రాజీనామా చేశారు. లక్సెట్టిపేట, క్యాతనపల్లిలోనూ ప్రస్తుత చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇచ్చారు. దీంతో జిల్లాలో చెన్నూరు మినహా అన్ని చోట్ల అవిశ్వాసాల పర్వం కొనసాగుతోంది. అక్కడ కూడా లోలోపల మంత్రాంగం నడిపిస్తున్నారు.

పదవిపై ఆశతోనే ఖర్చు

జిల్లాలో మొదట అవిశ్వాస గంట మోగిన మంచిర్యాల పట్టణ పరిధిలో ఒక్కొక్కరుగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడం మొదలుపెట్టారు. బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికైన పట్టణ చైర్మన్ తన పదవీ కాపాడుకునేందుకు అపసోపాలు పడ్డారు. కౌన్సిలర్లు తమ పార్టీ మారకుండా అవిశ్వాస గండం తప్పించుకునేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయి. కొందరికి చేతిలో డబ్బులు పెట్టినా ఆగకుండా పార్టీ మారిపోయారు. ఇక్కడ కుర్చీ కోసం ఇద్దరు ముగ్గురు అభ్యర్థులు పోటీ పడ్డారు. ఓ కౌన్సిలర్ ఖర్చంతా భరించేందుకు ముందుకు వచ్చారు. తననే చేయాలని కోరారు. ఇక నస్పూర్, లక్సెట్టిపేటలోనూ కాంగ్రెస్ బలం పెరగడంతో అక్కడ కూడా చైర్మన్లు పదవులు కోల్పోవల్సి వస్తోంది. కొత్తగా ఎన్నికవుతున్న వారు రూ.లక్షల్లోనే డబ్బులు ఖర్చు చేసుకోవాల్సి వస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. క్యాతనపల్లిలో అవిశ్వాస తీర్మానం ఇచ్చే ముందు సభ్యునికి ముందు రూ.లక్షన్నర, తీర్మానం సమావేశంలో నెగ్గాక మరో రూ.లక్షన్నర మొత్తం రూ.3లక్షల వరకు ఇచ్చేందుకు అంతర్గతంగా ఒప్పందం నడిచింది. బెల్లంపల్లి పరిధిలో చైర్మన్ పదవి ఆశిస్తున్న వారు సభ్యునికి రూ.75వేలు వైస్ చైర్మన్ రూ.50వేలు చొప్పున ఖర్చు పెట్టుకుంటామని ముందే ఒప్పందానికి వచ్చారు. మంచిర్యాల, లక్సెట్టిపేట, నస్పూర్ పట్టణ పరిధిలోనూ కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికయ్యే వరకు ఖర్చు పెట్టుకోవాలిస్సిన పరిస్థితి ఉంది. ఇక క్యాంపులకు తరలింపులు, బస, ఇతర విహారయాత్రలకు ఖర్చు రూ.లక్షలు దాటుతోంది. ఈ ఖర్చంతా ఊహించిన కొందరు పదవీపై ఆశలు ఉన్నా కుర్చీ కోసం ముందుకు రాకుండా ఉండిపోయినట్లుగా చెప్పుకుంటున్నారు.

నేడు నస్పూర్ చైర్మన్‌పై అవిశ్వాసం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ రాములు



ప్రభాకర్



సురిమిల్ల వేణు



గెల్లు రజిత

- ఉదయం 11గంటలకు మున్సిపల్ సమావేశం
- శిబిరం నుంచి నేరుగా సమావేశానికి కౌన్సిలర్లు
- ఇప్పటికే వైస్ చైర్మన్ రాజీనామా

నస్పూర్: నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానానికి శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంచిర్యాల ఆర్డీవో, ప్రొసీడింగ్ అధికారి రాములు గురువారం మున్సిపల్ కమిషనర్ రమేశ్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. చైర్మన్‌పై అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తూ డిసెంబర్ 18న పలువురు కౌన్సిలర్లు కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. ఈ నేపథ్యంలో సమావేశం ఏర్పాటు చేయగా.. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించుకోవడం కాంగ్రెస్ పార్టీకి లాంఛనమే. కాగా, నోటీసు అందించిన రోజునే వైస్‌చైర్మన్ తోట శ్రీనివాస్ తన పదవికి రాజీనామా చేశారు.

అధికార మార్పిడితో..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఓటమితో మున్సిపల్‌లో అధికార మార్పిడికి దారి తీసింది. 2020లో జరిగిన బల్దియా ఎన్నికల్లో 25 స్థానాలకు గాను బీఆర్‌ఎస్ 10, కాంగ్రెస్ 6, బీజేపీ 3, సీపీఐ 2, స్వతంత్రులు 3, ఏఐఎఫ్‌బీ 1 గెలుపొందారు. వీరిలో స్వతంత్రులు, ఏఐఎఫ్‌బీ కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌లో చేరగా.. సీపీఐ మద్దతుతో చైర్మన్‌గా ఈసంపల్లి ప్రభాకర్, స్వతంత్ర కౌన్సిలర్ తోట శ్రీనివాస్ వైస్‌చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం బీఆర్‌ఎస్ కౌన్సిలర్ బండారి సంధ్యారాణి కాంగ్రెస్‌లో చేరగా, బీజేపీ కౌన్సిలర్లు కోడూరి లహరి, బేర సత్యనారాయణ, కాంగ్రెస్ కౌన్సిలర్ కెడిక ప్రకాశ్ రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్ బలం 15కు చేరింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్ సభ్యుల సంఖ్య 6కు పడిపోగా, కాంగ్రెస్ బలం 16కు చేరింది. బీజేపీ, ఇద్దరు సీపీఐ కౌన్సిలర్ల మద్దతుతో 19కి పెరిగింది. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గడం కాంగ్రెస్‌కు తేలిక కానుంది. ఇప్పటికే హైదరాబాద్ శిబిరంలో ఉన్న కౌన్సిలర్లు నేరుగా సమావేశానికి హాజరు కానున్నారు.

పదవులు 'హస్త'గతం

బల్దియాలో ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానం నెగ్గితే చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు హస్తగతం కానున్నాయి. చైర్మన్‌గా ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు, వైస్‌చైర్‌పర్సన్‌గా డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గెల్లు రజిత ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

బీఆర్‌ఎస్‌కు 19 మంది కౌన్సిలర్ల రాజీనామా



బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన కౌన్సిలర్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాల్టీలో బీఆర్‌ఎస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న 19మంది కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై అవిశ్వాసం ప్రకటించిన కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లిన విషయం తెలిసిందే. శుక్రవారం మున్సిపాల్టీలో అవిశ్వాసంపై ఓటింగ్ జరగనుంది. అవిశ్వాసం నెగ్గాలంటే 22 మంది సభ్యుల మద్దతు అవసరం ఉంటుంది. అవిశ్వాసాన్ని ఎదుర్కోబోతున్న సుదర్శన్ కూడా బీఆర్‌ఎస్ శిబిరంలో ఉన్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కన ఆ పార్టీ సభ్యుల బలం 21 ఉండగా.. మరో సభ్యుడి మద్దతు కోసం క్యాంపునకు వెళ్లిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అవిశ్వాసం విషయంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వైఖరికి విసుగు చెంది 19మంది రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మరో ఇద్దరు కౌన్సిలర్లు బొడ్డు నారాయణ, సుదర్శన్ రాజీనామాకు విముఖత వ్యక్తం చేసినట్లు శిబిరం నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ బీఆర్‌ఎస్ నాయకుడు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన చైర్ పర్సన్ శ్వేతకు మద్దతుగా చేస్తున్న అవిశ్వాస రాజకీయాల వల్ల బెల్లంపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీ కనుమరుగయ్యే పరిస్థితులు ఉండడంతో పార్టీకి రాజీనామా చేసినట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పంపనున్నట్లు తెలిపారు.

మంచిర్యాల మున్సిపల్‌లో నెగ్గిన అవిశ్వాసం



అవిశ్వాసం కోసం సమ్మతి తెలుపుతున్న కౌన్సిలర్లు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్‌లపై గురువారం మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి, మంచిర్యాల ఆర్డీవో రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కలెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌తో కలిసి కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు శిబిరం నుంచి నేరుగా బస్‌లో సమావేశానికి వచ్చారు. 36 మంది కౌన్సిలర్లలో 26 మంది కాంగ్రెస్ పార్టీ, బీజేపీ కౌన్సిలర్‌తో కలిసి మొత్తంగా 27 మంది హాజరయ్యారు. అవిశ్వాస తీర్మానం కోసం సమ్మతిని తెలిపేందుకు చేతులెత్తడం ద్వారా ఓటింగ్ నిర్వహించారు. చైర్మన్ రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్‌లపై వేర్వేరుగా అవిశ్వాసం ఓటింగ్‌లో 27 మంది కౌన్సిలర్లు చేతులెత్తి సమ్మతిని తెలిపారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడానికి మొత్తం సభ్యుల్లో 2/3 అవసరమైన మెజారిటీ 24 మంది సభ్యులు కాగా, 27 మంది బలపర్చారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో ప్రకటించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నస్పూర్ ఫస్ట్



నస్పూర్ మున్సిపల్ కార్యాలయం

నస్పూర్: కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్-2023 కార్యక్రమంలో జిల్లాలోని మున్సిపాల్టీలు వివిధ ర్యాంకులు సాధించాయి. ఇంటింటికి చెత్త సేకరణ, వ్యర్థాల ఉత్పత్తి ప్రాసెసింగ్, డంపింగ్ కేంద్రాల నిర్వహణ, నీటి వనరుల పరిశుభ్రత, పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రత, సేంద్రియ ఎరువుల తయారీ తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ర్యాంకులు ప్రకటించింది. ఇందులో నస్పూర్ మున్సిపాల్టీ జిల్లాలోని ఏడు మున్సిపాల్టీల్లో మొదటి ర్యాంకు సాధించింది. సౌత్‌జోన్‌లోని 201 మున్సిపాల్టీల్లో నస్పూర్‌కు 12వ స్థానం దక్కింది. భవిష్యత్‌లో మరింత ఉత్తమమైన ర్యాంకు సాధనకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ టి.రమేశ్ తెలిపారు.

లక్సెట్టిపేటకు 65

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట బల్దియాకు రాష్ట్రంలో 65వ ర్యాంకు వచ్చినట్లు కమిషనర్ కల్లెడ రాజశేఖర్ తెలిపారు. జాతీయ స్థాయిలో 968, జోనల్ స్థాయిలో 20వ స్థానంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ర్యాంకు రావడం ఇదే మొదటిసారి కావడంతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పడిపోయిన మంచిర్యాల ర్యాంకు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాల్టీ ర్యాంకు పడిపోయింది. దేశంలో లక్ష జనాభా కలిగిన 3,970 పట్టణాల్లో జాతీయ ర్యాంకు 1,732 సాధించగా, సౌత్‌జోన్‌లో 94వ స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయిలో 131 పట్టణాలతో పోటీ పడి 121వ ర్యాంకుతో సరిపెట్టుకుంది. 2022లో రాష్ట్ర స్థాయిలో 26వ ర్యాంకు రాగా, ఈ ఏడాది 121వ ర్యాంకుకు పడిపోయింది.

చెన్నూర్ అంతే..

చెన్నూర్: గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది చెన్నూర్ మున్సిపాలిటీ ర్యాంక్ పడిపోయింది. గత ఏడాది రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంకు, జోనల్ ర్యాంక్ 28 కాగా ఈ ఏడాది రాష్ట్ర స్థాయిలో 93కు, జోనల్ ర్యాంక్ 30కి పడిపోయాయి. మున్సిపాలిటీలో పరిశుభ్రతలో విషయంలో వెనుకబడి ఉన్నట్లు ర్యాంక్‌లు తేటతెల్లం చేస్తున్నాయి.

సంక్రాంతి నుంచి ప్రతీరోజు తాగునీరు

• మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: సంక్రాంతి పండుగ నుంచి మంచిర్యాల నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీల్లో స్వచ్ఛమైన తాగునీటిని ప్రతీరోజు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 14న ఉదయం మంచిర్యాల, నస్పూరు, 15న లక్సెట్టిపేట మున్సిపాలిటీలో ప్రతీరోజు తాగునీటి సరఫరాను ప్రారంభిస్తామని తెలిపారు. రెండు గంటలపాటు తాగునీటిని సరఫరా ఉంటుందని, వేసవిలోనూ నిత్యం అందించేందుకు పనులు సాగుతున్నాయని అన్నారు. ఐబీ ఆవరణలో మాతాశిశు ఆసుపత్రితోపాటు జనరల్ ఆసుపత్రిని 600 పడకలతో నిర్మిస్తామని, రెండూ ఒకేచోట ఉండడం వల్ల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీకి శాశ్వతంగా డంపింగ్‌యార్డు ఏర్పాటు కోసం సింగరేణి స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. నస్పూరులోని ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వాటిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని, నిరుపేదలకు పంపిణీ చేస్తామని అన్నారు. మంచిర్యాలలో చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసానికి సహకరించిన కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్లు ఉప్పలయ్య, మహేశ్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రణాళికతో విద్యాబోధన



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్‌సీవో

బెల్లంపల్లి: విద్యార్థులను ఒత్తిడికి గురి చేయకుండా ప్రత్యేక ప్రణాళికతో విద్యాబోధన చేస్తూ సంక్షేమ గురుకులాలు ముందుకు వెళ్తున్నాయని ఆదిలాబాద్ రీజియన్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కో ఆర్డినేటర్ కే.స్వరూపరాణి అన్నారు. గురువారం బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ కళాశాలలో ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అధ్యక్షతన ఇంపాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థుల ప్రగతి నివేదికలను తల్లిదండ్రులకు అందజేశారు.

రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

యాద్రాద్రి జిల్లా జగద్గిరిగుట్టలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో సీఓఈ విద్యార్థులు కే.భరద్వాజ్, సీహెచ్.సంజయ్ ప్రథమ బహుమతి సాధించారు. వీరికి గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి నవీన్ నికోలస్ రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. విద్యార్థులను ఆర్సీవో స్వరూపరాణి అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, జేపీపీ రాజేశ్వర్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు పూదరి నగేష్‌గౌడ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందడి



జిల్లాలో ఇంటింటా సంక్రాంతి పండుగ సందడి నెలకొంది. కుటుంబ సభ్యులందరూ కలిసి పిండి వంటలు చేస్తున్నారు. పట్టణాల్లోని పిల్లలు ఇళ్లకు చేరుతుండగా.. ఇతర ప్రాంతాల్లో ఉన్న పిల్లలకు పిండివంటలు తయారు చేసి పంపిస్తున్నారు.



పాత కాలంలో చేసినట్లే చేసుకుంటాం



మంచిర్యాలటౌన్: సంక్రాంతి పండుగకు పాతకాలంలో చేసినట్లుగానే చకినాలు, గారెలు, పిండివంటలు చేసుకుంటాం. పిండి గిర్నీలు, గ్రైండర్ల వంటి వాటిలో పిండి పట్టడం కాకుండా, దంచుకోవడం చేస్తున్నాం. బియ్యం నానబెట్టి, పిండిలాగ దంచుకోవడం, గారెల కోసం రుబ్బు రోళ్లను వాడుతున్నాం. పిండిని గిర్నీలో పట్టడం, గ్రైండర్‌లో మెత్తగా చేసిన వాటితో పిండి వంటకాలను చేస్తే.. స్వయంగా రుబ్బిన, దంచిన వాటి వలే రుచి రాదు.

– బూర్ల అమృతమ్మ, ఎల్‌ఐసీ కాలనీ, మంచిర్యాల

- వివరాలు 9లో▸

చట్టసభల్లో బీసీల వాటాకు మహాపాదయాత్ర



మాట్లాడుతున్న సాయిని నరేందర్

పాతమంచిర్యాల: చట్టసభల్లో బీసీలకు వాటా కోసం మహా పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆలిండియా ఓబీసీ ఐక్యకార్యాచరణ సమితి చైర్మన్ సాయిని నరేందర్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో బీసీ మహా పాదయాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించిన ఆదిలాబాద్ ప్రాంత బీసీ టైగర్ కొండ లక్ష్మణ్ బాపూజీ వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్తామని అన్నారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ నరేంద్రమోదీ బీసీలకు ఏమీ చేయలేదని, చట్టసభల్లో బీసీలకు వాటా లేనంత కాలం ఎవరూ ఏమి చేయలేరని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఓబీసీ జాక్ వైస్ చైర్మన్ దిండి విష్ణుమూర్తి, సభ్యులు చాపర్తి కుమార్‌గాడ్గే, ఆకుల సంజీవరావు, బత్తుల ప్రకాశ్, బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్లు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బొల్లం లింగమూర్తి, బీసీ మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు సిరవేని స్వప్న, రాష్ట్ర కార్యదర్శి భిక్షపతిగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరిగౌడ్, బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మైలారం విద్యార్థిని



ఎంపికైన విద్యార్థినితో హెచ్ఎం, పీఈటీ

నెన్నెల: మండలంలోని మైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని గంట వైష్ణవి అండర్ -14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, పీఈటీ సాంబమూర్తి తెలిపారు. శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో బుధవారం నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకు జనగామలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో వైష్ణవి పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థినిని ఎస్ఎంసీ చైర్మన్ తాడూరి భాస్కర్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.



క్లుప్తంగా

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

ఆసిఫాబాద్‌: మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.35వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్‌ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్‌ గురువారం తీర్పు చెప్పారు. సీఐ సాదిక్‌పాషా తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో 2018లో జరిగిన అత్యాచారం ఘటనలో రవీంద్రనగర్‌కు చెందిన సత్యజిత్‌ మండల్‌పై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌ చేశారు. అప్పటి సీఐలు బి.శ్రీనివాస్‌, బుద్దస్వామి, డి.మోహన్‌ విచారణ చేపట్టారు. అనంతరం సాక్షాధారాలతో చార్జిషీట్‌ దాఖలు చేసి, ఫోక్సో కేసులో పోలీసులు సాక్షులను ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌ తరపున పీపీ ప్రసాద్‌ వాదించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా జిల్లా లైజనింగ్‌ ఆఫీసర్‌ కె. సాగర్‌, హెడ్‌కానిస్టేబుల్‌ బాబాజీలను ఎస్పీ సురేశ్‌ కుమార్‌ అభినందించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): హాజీపూర్‌ మండలం సబ్బెపల్లిలో గురువారం చోరీ జరిగింది. ఎస్సై నరేశ్‌కుమార్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాపల్లికి చెందిన గుండ ఐలయ్య తన భార్య లక్ష్మితో కలిసి చేను పనుల్లో భాగంగా ఇంటికి, గేట్‌కు తాళం వేసి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి గేట్‌ తాళం తీసి ఇంట్లోకి వెళ్లే క్రమంలో ఇంటి తలుపు బెడెం విరగ్గొటి ఉంది. అనుమానం వచ్చి వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూంలోని వస్తువులు, బట్టలు చిందరవందరగా ఉండి బీరువా తలుపులు తీసి ఉన్నాయి. బీరువాలోని రూ.70 వేల నగదుతోపాటు తులం బంగారు గొలుసు, 18 తులాల వెండి గొలుసులు చోరీకి గురయ్యాయి. వీటి విలువ రూ.1.30 లక్షలు ఉంటుందని గుర్తించారు. బాధితుడు ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఎండీని కలిసిన రిటైర్డ్‌ ఉద్యోగులు



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్‌: సింగరేణి సీఎండీ బాధ్యతలు చేపట్టిన బలరాంను సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఆ సంఘం అధ్యక్షుడు దండంరాజ్‌ రాంచందర్‌, ఉప ప్రధాన కార్యదర్శి ఆలవేందర్‌ వేణుమాదవ్‌లతో పాటు పలువురు సీఎండీని మర్యాదపూర్వకంగా కలిసి నూతనంగా బాధ్యతలు చేపట్టడడంతో శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి ఉద్యోగులకు ఆసుపత్రుల్లో అపరిమిత వైద్య సేవలు అందించాలన్నారు. సీపీఆర్‌ఎంఎస్‌ మెడికల్‌ కార్డులో నిమ్స్‌ టారిఫ్‌లో 40 శాతం కోత విధించరాదని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కంచ భీరయ్య, ప్రసాద్‌, పూర్ణ ప్రకాశ్‌, జయంత్‌కుమార్‌ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ నాయకులు..

రెబ్బెన(ఆసిఫాబాద్‌): బెల్లంపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ నాయకులు సింగరేణి సంస్థ నూతన సీఅండ్‌ఎండీ బలరాం నాయక్‌ను గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్‌ మాట్లాడుతూ గోలేటి ఓసీపీని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బెల్లంపల్లిలోని ఏరియా ఆసుపత్రిలోని ఆక్సిజన్‌ ప్లాంట్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. సీనియర్‌ నాయకులు ప్రకాష్‌రావు, కార్యదర్శి మాదవకృష్ణ, నాయకులు చంద్రకుమార్‌, రామారావు, నారాయణ, సోగాల వామన్‌, కందుల తిరుపతి ఉన్నారు.

ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త..!



- పండుగ వేళ పోలీసులకు సమాచారం ఇవ్వండి
- విలువైన నగలు, నగదు బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోండి
- చైన్‌దొంగలతో అప్రమత్తత అవసరం

మంచిర్యాలక్రైం: సంక్రాంతి పండుగకు ఊరెళ్తున్నారా జర జాగ్రత్త.. బస్టాండ్‌, రైల్వేస్టేషన్లలో అధిక రద్దీ ఉంటుంది. బస్సు, రైలు ఎక్కేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. జనం గుంపులు గుంపులుగా ఉండడమే అదునుగా భావించి చైన్‌దొంగలు, పిక్‌ పాకెటర్స్‌ మాటు వేసి చేతివాటం ప్రదర్శిస్తారు. మరికొందరు మాయమాటలు చెప్పి సహాయం చేస్తామని మోసాలకు పాల్పడే వారూ ఉంటారు. పండుగ, పిల్లలకు పాఠశాలల సెలవుల నేపథ్యంలో గ్రామాలు, పట్టణాల నుంచి ఊర్లకు వెళ్తుంటారు. దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడుతుంటారు. ఈ నేపథ్యంలో రామగుండం పోలీస్‌ కమిషనర్‌ రెమా రాజేశ్వరి ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఊరు వెళ్లే ముందు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్‌ నిఘా ఉంటుందని, ప్రజలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.

ఇవి పాటించండి..

- ఊర్లెళ్లేవారు పక్కింటి వారికి చెప్పాలి, లేదా వెళ్లే ముందు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఎన్ని రోజులు, ఎక్కడికి వెళ్తున్నారు, ఎప్పుడు వస్తారో పక్కా సమాచారం ఇవ్వాలి.
- అతి తక్కువ ధరకు దొరికే వైఫై బేస్‌డ్‌ రోబో కెమెరా అమర్చుకోవాలి. దీని నుంచి మీ ఇంట్లో జరిగే విషయాలు మీ సెల్‌ఫోన్‌కు అలర్ట్‌ రింగ్‌ టోన్‌ వస్తుంది. అది వారికి వినిపించదు. వారు దొంగతనం చేస్తుండగానే పట్టుకునే అవకాశం ఉంటుంది. ఇది ఏవైనా నాలుగు సెల్‌ఫోన్లకు వినియోగించుకోవచ్చు. ఒక్కటి పోలీస్‌ అధికారి నంబర్‌కు సైతం వాడుకోవచ్చు. సుమారు దీని ధర రూ.2500 ఉంటుంది. వైఫైతోపాటు ఎస్‌డీ కార్డ్‌ అదనంగా కంపెనీ వారు అందిస్తున్నారు.
- మార్కెట్‌లో సైరన్‌ మోగే తాళాలు సైతం అతి తక్కువ ధరలో లభిస్తున్నాయి. దానిని కదిలించే ప్రయత్నం ఎవరు చేసినా సైరన్‌ మోగుతుంది. దీంతో పక్కవారు అప్రమత్తం అయ్యే అవకాశం ఉంది.
- తాళం వేసి అది కనిపించకుండా డోర్‌ కర్టెయిన్‌ కప్పి ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఇంటి ముందు ఉన్న గేటుకు తాళం వేయకపోవడం మంచిది, బెడ్‌రూంలో లైట్‌ వేసి ఉంచాలి.

సమాచారం ఇస్తే భద్రత కల్పిస్తాం..



ప్రజల భద్రత, ఆస్తుల రక్షణకు మేమున్నాం. నిర్భయంగా సమాచారం ఇవ్వండి రక్షణ కల్పిస్తాం. పట్టణంలో 24గంటలు నాలుగు బ్లూ కోల్ట్స్‌ బృందాలు తిరుగుతున్నాయి. 100 నంబర్‌కు ఫోన్‌ చేసి సమాచారం ఇస్తే ఐదు నిమిషాల్లో పోలీసులు మీ దగ్గర ఉంటారు. ఊర్లకు వెళ్లేవారు ముందుగానే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చి వెళ్లే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. ప్రయాణంలో చైన్‌ స్నాచర్స్‌తో అప్రమతగా ఉండండి.
– రెమా రాజేశ్వరి, రామగుండం పోలీస్‌ కమిషనర్‌

- నగలు, నగదు బీరువాల్లో దాచిపెట్టకపోవడం మంచిది.
- నగదు డబ్బులు, ఆభరణాలు బ్యాంకుల్లో భద్రపర్చుకోవడం ఉత్తమం.
- అపార్ట్‌మెంట్‌లో ఉండేవారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- కొత్తగా ఎవరైనా అద్దెకు దిగినవారి పూర్తి వివరాలు సేకరించాలి. అవసరమైతే వారి ఆధార్‌ కార్డ్‌, ఏం చేస్తుంటారో, సొంత ఊరు ఎక్కడ అనే వివరాలు తెలుసుకోవాలి. వారి ఇంటికి వచ్చిపోయేవారి వివరాలు సేకరిస్తే మరీ మంచిది.
- మహిళలు బయటకు వెళ్లేముందు విలువైన నగలు ధరించకపోవడం మంచిది. నగలు కనిపించకుండా చీరకొంగు లేదా చున్నీ మెడ చుట్టూ కప్పుకోవాలి.
- గుర్తు తెలియని వ్యక్తులు మన పరిసర ప్రాంతాల్లో తిరిగినప్పుడు 100 నంబర్‌కు ఫోన్‌ చేసి సమాచారం ఇవ్వాలి.

పిల్లలూ.. జర భద్రం



మంచిర్యాల కేజీబీవీ నుంచి ఇంటికి వెళ్లుతున్న విద్యార్థినులు

మంచిర్యాలఅర్బన్‌: పిల్లలు జాగ్రత్తగా ఉండండి.. ఇంటి దగ్గర చదువుకోండి. పదో తరగతి, ఇంటర్‌ పరీక్షలు దగ్గరలో ఉన్నాయి. ఫార్మెటివ్‌ అసెస్‌మెంట్‌తోపాటు ప్రీ ఫైనల్‌ ఎగ్జామ్‌ ఉన్నాయి. కాస్త పుస్తకం పట్టేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోండి.. సెలవులు ముగియగానే మళ్లీ కేజీబీవీలకు రండి అంటూ కేజీబీవీల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు స్పెషల్‌ ఆఫీసర్ల సూచన ఇది..

సంక్రాంతి సెలవులు వచ్చేశాయ్‌..

సంక్రాతి పండుగకు ఈ నెల 12నుంచి 17వరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. సంక్రాంతి సెలవులంటే కాస్త మక్కువ.. అమ్మమ్మ ఇంటికో.. నాన్నమ్మ దగ్గరికో వెళ్లాలని చిన్ననాటి ఊసులు మరోసారి పంచుకోవాలని పిల్లలు మారాం చేస్తుంటారు.. ఆమాటకొస్తే ఎప్పుడెప్పుడో సెలవులు వస్తాయోనని ఎదురు చూసే విద్యార్థులు సంక్రాంతి సెలవులతో గురువారం ఇంటిబాట పట్టారు. ఉదయం నుంచి తల్లిదండ్రులు పిల్లల కోసం విద్యాసంస్థలకు చేరుకున్నారు. దీంతో కేజీబీవీ, ఇతర



వసతితో కూడిన విద్యాలయాల వద్ద కోలాహంగా మారింది. సెలవులు వేళ ఇదివరకు తెచ్చుకున్న వస్తువులు.. పుస్తకాలు అన్నింటినీ వెంట తీసుకెళ్లారు. తోటి విద్యార్థులతో కొంతసేపు కాలక్షేపం చేయడం.. ఫోన్‌నంబర్లు తీసుకోవడం కనిపించింది. 12 నుంచి సెలవులు ప్రకటించిన ముందు రోజు నుంచి కేజీబీవీల వద్ద బోసిపోయాయి. తిరిగి 18న విద్యాసంస్థలు తెరుచుకోనున్నాయని విద్యాశాఖ ప్రకటించింది.

బస్సులు ఆపడం లేదని నిరసన

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్‌ చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని గురువారం రాత్రి పలువురు ప్రయాణికులు నిరసన వ్యక్తం చేశారు. మంచిర్యాల నుంచి నిర్మల్‌, ఆదిలాబాద్‌ వైపు వెళ్లే బస్సులన్నీ సాయంత్రం నాలుగు గంటల నుండి కిక్కిరిసి రావడంతో బస్సులు ఆపలేదు. దీంతో విసిగిపోయిన ప్రయాణికులు రోడ్డుకు అడ్డంగా పడుకున్నాడు. అరగంట పాటు రోడ్డుపై అలాగే పడుకోవడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.



నిరసన తెలుపుతున్న ప్రయాణికుడు

పదోన్నతులతో పెరగనున్న బాధ్యత

శ్రీరాంపూర్‌: పదోన్నతులతో మరింత బాధ్యతగా పని చేయాలని శ్రీరాంపూర్‌ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. గురువారం శ్రీరాంపూర్‌ జీఎం కార్యాలయం వద్ద ఉద్యోగులకు ఎస్‌ఎల్పీ (సర్వీస్‌ లింక్డ్‌ ప్రమోషన్స్‌) ప్రమోషన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్‌లో మొత్తం 342మందికి ఎస్‌ఎల్పీ ప్రమోషన్లు అందిస్తున్నామన్నారు. ప్రతీ సంవత్సరం జనవరిలో వీటిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటూజీఎం రఘుకుమార్‌, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఎస్టేట్స్‌ అధికారి వరలక్ష్మీ, క్వాలిటీ మేనేజర్‌ వెంకటేశ్వర్‌ రెడ్డి, డీవైపీఎంలు రాజేశ్వర్‌రావు, దేవేందర్‌రెడ్డి, రాజేశ్‌, సీనియర్‌ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

ఆర్కే 6 గనిలో...

ఆర్కే 6గనిలో 41మందికి ఎస్‌ఎల్పీ ప్రమోషన్ల పత్రాలను గని మేనేజర్‌ సంబంధిత ఉద్యోగులకు



పదోన్నతి పత్రాలను అందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

అందించారు. ఉద్యోగులందరికీ ఈ ప్రమోషన్‌తో ఆర్థికంగా మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్‌, వెంటిలేషన్‌ అధికారి రాంనర్సయ్య, పిట్‌ ఇంజినీర్‌ అండే శ్యాంకుమార్‌, సెక్షన్‌ ఇంజినీర్‌ మహేశ్‌, సీనియర్‌ పీవో సునీల్‌కుమార్‌, గుర్తింపు సంఘం నాయకులు ముస్కె సమ్మయ్య, సంఘం నాయకులు సదానందం, బాలసాని లక్ష్మణ్‌, చిలుక రాంచందర్‌, తోట మహేశ్‌ పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి

నస్పూర్‌: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని శ్రీరాంపూర్‌ ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. గురువారం నస్పూర్‌ కాలనీలోని సింగరేణి స్టేడియంలో నిర్వహించిన రేడియంట్‌ పాఠశాల వార్షిక క్రీడోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు సైతం ఎంతో ముఖ్యమని వివరించారు. నూతనంగా నిర్మించిన సింగరేణి స్టేడియాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకలను జనవరి 26న సింగరేణి స్టేడియంలోనే నిర్వహిస్తామని వెల్లడించారు. అంతకుముందు విద్యార్థులు చేసిన విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. ఈ కార్యక్రమంలో



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న జీఎం సంజీవరెడ్డి

మంచిర్యాల ట్రాఫిక్‌ సీఐ కే.నరేష్‌, సీసీసీ నస్పూర్‌ ఎస్సై రవికుమార్‌, పాఠశాల కరస్పాండెంట్‌లు చెన్నూరి అఖిల, చెన్నూరి అమన్‌ ప్రసాద్‌, ప్రిన్సిపల్‌ రజని, ట్రస్మా నాయకులు మైదం రామకృష్ణ, ఊట్ల సత్యనారాయణ, అంబాల రాజ్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్‌ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

మందమర్రిరూరల్‌: సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్డ్‌ అయిన ఉద్యోగులకు సంస్థ చెలించాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలని సింగరేణి ఏరియా రిటైర్డ్‌ ఉద్యోగులు డిమాండ్‌ చేశారు. గురువారం పట్టణంలోని సాయిబాబా గుడి ఎదుట అంబేద్కర్‌ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రిటైర్డ్‌ అయిన తర్వాత పింఛన్‌పై ఆధారపడి జీవించాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. తమకు రావాల్సిన వేజ్‌బోర్డ్‌ ఏరియర్స్‌, గత ఆర్థిక సంవత్సరపు లాబాల వాటా, దీపావళి బోనస్‌, 2016 తర్వాత పెరిగిన గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్‌ చేశారు. బకాయిల చెల్లింపులు ఆలస్యమైతే తాము సంఘంగా ఏర్పడి ఆందోళనలు చేయడానికి సమాయత్తమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్‌ ఉద్యోగులు వాసాల శంకర్‌, రేణికుంట్ల కొమురయ్య, రవీందర్‌, నెల్లి వీరన్న, పోలు సంపత్‌, నాయిని శంకర్‌, దాసరి ఎల్లారం, ఇరుగురాల వెంకటి ఉన్నారు.



నిరసనలో సింగరేణి రిటైర్డ్‌ ఉద్యోగులు

ప్రతిభ కనబరిచిన గురుకుల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌

మంచిర్యాలటౌన్‌: మంచిర్యాల సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ నెల 9, 10వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఇగ్నైట్‌ కాంపిటీషన్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. థీమాటిక్‌ పెయింటింగ్‌లో పదో తరగతికి చెందిన జి.అరుణ్‌ తేజకు మొదటి బహుమతి, తెలుగు భాషలో ఉపన్యాసానికి పి.అరుణ్‌కుమార్‌ మూడో బహుమతిని పొందారు. మొదటి బహుమతి విజేతకు రూ.10వేలు, మూడో బహుమతిగా రూ.5వేలు ఇచ్చినట్లు ప్రిన్సిపల్‌ కె. మోహన్‌ తెలిపారు.

పదోన్నతుల కోసం పరీక్ష ..



పరీక్షలో పాల్గొన్న ఉద్యోగి

మందమర్రిరూరల్‌: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్‌ ఆవరణలో గురువారం అసిస్టెంట్‌ చైన్‌మెన్‌, చైన్‌మెన్‌ పదోన్నతుల కోసం పరీక్షలు నిర్వహించారు. ఏరియాలో అసిస్టెంట్‌ చైన్‌మెన్‌ పోస్టులు 13 ఉండగా 22మంది ఇంటర్నల్‌ సర్వే మజ్దూర్‌లు దరకాస్తు చేసుకోగా 21మంది పరీక్షకు హాజరయ్యారు. అలాగే 5 చైన్‌పోస్టులకు ఇద్దరు పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షల పర్యవేక్షణలో ఎస్వో టూ జీఎం రాజేశ్వరరెడ్డి, ఏరియా సర్వే ఆఫీసర్‌ ఉజ్వల్‌ బందోపాధాయ, పర్సనల్‌ మేనేజర్‌ శ్యాంసుందర్‌ ఉన్నారు.

మార్లవాయిని అభివృద్ధి చేస్తాం



నివాళులర్పిస్తున్న ఎంపీ సోయం బాపూరావు, తదితరులు

- డార్ఫ్‌ దంపతుల రాకతో గ్రామానికి గుర్తింపు
- ఎంపీ సోయం బాపూరావు
- ఘనంగా హైమన్‌ డార్ఫ్‌, బెట్టి ఎలిజబెత్‌ దంపతుల వర్ధంతి

జైనూర్‌(ఆసిఫాబాద్‌): చారిత్రాత్మకమైన మార్లవాయి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆదిలాబాద్‌ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. కుమురంభీం జిల్లా జైనూర్‌ మండలం మార్లవాయిలో గురువారం హైమన్‌ డార్ఫ్‌, బెట్టి ఎలిజబెత్‌ దంపతుల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. డార్ఫ్‌ దంపతుల విగ్రహాలకు ఎంపీతోపాటు ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు ఆదివాసీలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మార్లవాయి గ్రామంలో ప్రధాన మంత్రి గ్రామీణ యోజన కింద అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆదిమ గిరిజనుల అభివృద్ధి, ఇళ్లు, రహదారుల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.24వేల కోట్లు కేటాయించిందన్నారు. ఐటీడీఏ ద్వారా ఇళ్ల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. జోడేఘాట్‌, జంగుబాయి, కేస్లాపూర్‌, ఇంద్రవెల్లి, పద్మల్‌పూరి కాకో ఆలయాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ జంగుబాయి క్షేత్రానికి రోడ్డు వేసేందుకు అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని ఎంపీకి విన్నవించారు. అలాగే మార్లవాయిలో రూ.2.34 కోట్లతో నిర్మిస్తున్న మినీ ట్యాంక్‌ బండ్‌ అసంపూర్తిగా ఉందని, పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలని కోరారు.



సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థులు

డార్ఫ్‌ దంపతుల సేవలు చిరస్మరణీయం

ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం హైమన్‌ డార్ఫ్‌, బెట్టి ఎలిజబెత్‌ దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి అన్నారు. మార్లవాయి గ్రామంలో నిర్వహించిన డార్ఫ్‌ దంపతుల వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీల ఆత్మ బంధువులు డార్ఫ్‌ దంపతులని అన్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన 9 తెగలకు ప్రత్యేక స్థానం కల్పించారని అన్నారు. వారి కృషి ఫలితంగానే నేటికీ ఆదివాసీలకు ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

సిద్దాపూర్‌ సర్పంచ్‌పై కేసు

బెజ్జూర్‌: మండలంలోని పెద్ద సిద్దాపూర్‌ గ్రామపంచాయతీ సర్పంచ్‌ పోర్తెటి రవిపై కేసు నమోదు చేసినట్లు సివిల్‌ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డిప్యూటీ తహసీల్దార్‌ శ్రీనివాస్‌ తెలిపారు. సిద్దాపూర్‌ చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేసేందుకు వెళ్లగా సర్పంచ్‌ రవి ప్రజలకు బియ్యం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. బినామీ రేషన్‌ డీలర్‌గా ఉన్న అతడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే ఐదు క్వింటాళ్ల బియ్యం సైతం అక్రమంగా అమ్ముకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బెజ్జూర్‌ డీలర్‌ పురుషోత్తంకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు.

గతంలో సైతం..

గత కొన్ని నెలల క్రితం దాదాపు 18క్వింటాళ్ల బియ్యం సైతం అమ్ముకోవడంతో పాటు రేషన్‌



బియ్యం స్టాక్‌ పరిశీలిస్తున్న డీటీ శ్రీనివాస్‌

షాప్‌ బినామీగా నడిపిన అతడిపై అధికారులు అప్పట్లో కేసు నమోదు చేశారు. సర్పంచ్‌ పదవి అడ్డుపెట్టుకొని బినామిలపై షాప్‌ తెచ్చుకొని నడుపుతున్నాడు. ఇతడిపై చీటింగ్‌ కేసు నమోదు చేయడంతో పాటు సర్పంచ్‌ పదవి నుంచి తొలగించాలని బెజ్జూర్‌ పోలీస్‌స్టేషన్‌లో పలువురు ఫిర్యాదు చేశారు.

రేషన్‌ డీలర్‌ సహ ఇద్దరిపై కేసు

వాంకిడి: మండల కేంద్రంలోని రాంనగర్‌ కాలనీలోని 2411015 నంబరు రేషన్‌ డీలర్‌ వనపర్తి సునీత, ఆమె భర్త భాస్కర్‌ అలాగే సదరు డీలర్‌ వద్ద బియ్యం కొనుగోలు చేసిన ముజాహిద్‌లపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీ రాజ్‌కుమార్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రేషన్‌ దుకాణంలో తనిఖీలు నిర్వహించి బియ్యం స్టాక్‌ నిల్వలు పరిశీలించగా 39.02 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఈ విషయమై సదరు డీలర్‌ను విచారించగా స్థానికుడైన ముజాహిద్‌ అనే వ్యక్తికి అమ్మినట్లు తేలింది. దీంతో డీలర్‌తో సహా ఇద్దరిపై ఈసీ యాక్ట్‌ 1955 ప్రకారం 6ఏ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. డీలర్‌ వద్ద నుంచి దాదాపు 45 క్వింటాళ్ల పీడీయస్‌ బియ్యం, ఈ–పోస్‌ డివైజ్‌, కాంటాను సీజ్‌ చేసి ప్రజల సౌకర్యార్థం బియ్యం పంపిణీకి సీజ్‌ చేసిన దుకాణం ఇన్‌చార్జి బాధ్యతలను షాప్‌ నంబర్‌ 2411014కు అప్పగించినట్లు తెలిపారు.



ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్న డీటీ

సాక్షి క్లాసిఫైడ్స్‌

WANTED

మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌ టైమ్‌ / ఫుల్‌ టైమ్‌గా వర్క్‌ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926. [M-1167592]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462